మొక్కజొన్న మార్కెటింగ్ కోసం సీడ్స్ కంపెనీతో ఒప్పందం


సీడ్స్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కర్నూలుకు చెందిన చక్రా సీడ్స్, సాయికృష్ణ సీడ్స్ కంపెనీలతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి కంపెనీ ప్రతినిధులతో కలిసి పత్రాల పై సంతకాలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డీహెచ్ఎం 206 హైబ్రిడ్ రకం 10 టన్నుల వరకు దిగుబడి రానుందని తెలిపారు. ఈ హైబ్రిడ్ రకం ఉత్తరభారత దేశంలోని పంజాబ్, బీహార్, ఒడిస్సా వంటి రాష్ట్రాలకు ఎంతో అనుకూలమని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం నుంచి విడులైన డిహెచ్ఎం–117, డిహెచ్ఎం 121 వంటి హైబ్రిడ్ వంగడాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు గతంలో 43 సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగింది.

సెంట్రింగ్ కార్మికులు యూనియన్ నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లోని సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో సోమవారం కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. ప్రతి నెల అమావాస్య రోజున సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో జరిగే సమావేశానికి గుత్తేదారులు తప్పని సరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. అమావాస్య నాడు సెంట్రింగ్ కార్మికులకు సెలువుగా ప్రకటించుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్‌లో సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి వెంకటేష్, దేవప్ప, స్థానిక గుత్తేదారులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదాన కార్యక్రమం



మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీలోని శ్రీ విజయ కనకదుర్గ దేవాలయంలో ప్రతి అమావాస్య నాడు అన్నవితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు దానోజు శ్రీనివాస్‌చారి, సతీష్‌లు పేర్కొన్నారు. సోమవారం ఆలయంలో మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి నెల ఆలయంలో అన్నదానం చేయడానికి భక్తులు తమ శక్తి కొలది విరాళాలను స్వీకరించబడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ చెరువును సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అవసరం అయితేనే తప్ప బయటకి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో అధికారులతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిమాయత్‌సాగర్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, జలమండలి జనరల్ మేనేజర్ డేవిడ్‌రాజు, మేనేజర్ గోవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న పిట్టా ఉపేందర్ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ సభ్యత్వ నమోదు ప్రిపరేషన్ మీటింగ్ డివిజన్ అధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఇన్‌చార్జిగా జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టా ఉపేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. డివిజన్‌కు 20 వేల సభ్యత్వ టార్గెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు 400 మందికి తగ్గకుండా సభ్యత్వం చేయాలని చెప్పారు. బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉందని, ప్రజలు రాజేంద్రనగర్ డివిజన్‌లో గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించి మంచి మెజార్టీని అందించారని గుర్తు చేశారు. ఈ సమావేశానికి జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, సీనియర్ నాయకులు విఠల్, కీర్తి శ్రీను, పవన్ రాజ్, మల్లేష్‌చారి, పద్మావతి, రాకేష్ గౌడ్, ప్రకాష్ నాయక్, హర్షిత్‌రెడ్డి, పవన్, రమాకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జోహార్.. వైఎస్సార్


వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు సోమశ్రీనివాస్


బుద్వేల్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు


నివాళులర్పిస్తున్న పీసీసీ నేత నరేందర్, సంజయ్‌యాదవ్‌లు


నివాళులర్పిస్తున్న యువజన విభాగం నాయకులు ఏనుగుల సందీప్‌రెడ్డి


శివరాంపల్లిలోని నివాళులర్పిస్తున్న వైఎస్ఆర్ అభిమాని సోమ సీను

రాజేంద్రనగర్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించుకున్నారు. శివరాంపల్లిలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు ఏనుగుల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు పండ్లు, కేకులు పంపిణీ చేశారు. శివరాంపల్లిలోని వై.ఎస్.విగ్రహానికి వైఎస్ఆర్ అభిమాని సోమ సీను ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజేంద్రనగర్, బుద్వేల్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వై.ఎస్. విగ్రహానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

శివరాంపల్లి చౌరస్తాలో....

మైలార్‌దేవ్‌పల్లి: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్‌గుప్త సోమవారం శివరాంపల్లి చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్ఆర్ తీసుకువచ్చిన 108 సంక్షేమ పథకం అన్ని వర్గాల వారికి అండగా ఉందని, రెండు తెలుగు రాష్ట్రాలు వేరైనప్పటికీ రాజీవ్ ఆరోగ్య శ్రీ, 108 పథకాలు ప్రజలతో పాటు వచ్చిన ప్రభుత్వాలు ఆదరిస్తున్నాయన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో...

శంషాబాద్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు ఘనంగా నివాళు అలర్పించారు. పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి రేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌లు నగరంలోని మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో...

మణికొండ: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, నార్సింగిలోని ఆయన విగ్రహానికి నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్‌కుమార్, సాయిరాం, మల్లేష్, రాజు, చిన్న, జైరాంరెడ్డి, రమేష్, భవన్, సాయి, తివారి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ చౌరస్తాలో...

బండ్లగూడ: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి పురస్కరించి బండ్లగూడ చౌరస్తాలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో నిలిచిన జననేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, తలారి ప్రేమ్‌కుమార్, వైఎస్ఆర్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వట్టినాగులపల్లిలో నివాళులు అర్పించిన నాయకులు


బండ్లగూడ చౌరస్తాలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

హిమాయత్‌సాగర్ జలాశయానికి తగ్గిన వరద


హిమాయత్‌సాగర్ జలాశయం నీటి మట్టం

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమాయత్‌సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాలలో వర్షం తగ్గడంతో ఈసీ వాగు గుండా వచ్చే వరద ప్రవాహం తగ్గిపోయింది. సోమవారం సాయంత్రం వరకు జలాశయం నీటి మట్టం 1759.45 అడుగులు కాగా పూరిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు. మరో మూడు అడుగుల మేర వరదనీరు వచ్చి చేరితే హిమాయత్‌సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టంకు చేరుకుంటుంది.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం


నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: టీజీసీపీఏ మెయిన్ రోడ్, వైష్ణవి ఓయాసిస్ రోడ్‌లో నీరు నిలిచే ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సోమవారం ఉదయం పరిశీలించారు. కురుస్తున్న వర్షం కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వర్షం వల్ల నీరు నిలిస్తే వెంటనే నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షం వల్ల చెట్టు విరిగిపడినా, రోడ్లపై నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నా వెంటనే 9030740042కు సమాచారం అందించాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, గోపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతేనే బయటకు రావాలి

చెరువులను పరిశీలించిన కలెక్టర్


గండిపేట, నెక్నాంపూర్ చెరువులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

మణికొండ: ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్, నెక్నాంపూర్ చెరువులను సోమవారం జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులలోకి చేరిన నీటి మట్టం, పూర్తి స్థాయి నీటి మట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గేట్ల పనితీరు, సైరన్‌లను మోగించి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల పూర్తి స్థాయి నీటి మట్టానికి ఐదు, ఏడు అడుగుల దూరంలో ఉన్నాయన్నారు. జలమండలి వారు నీటిని వదలాలని నిర్ణయిస్తే ముందుగా మూసీ, ఈసీ వాగుల పరివాహకంలో ఉన్న ప్రజలను పూర్తి స్థాయిలో అప్రమత్తం చేయటం, లోతట్టు ప్రాంతాలో ఉన్న వారిని తరలించటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు కృష్ణమోహన్‌రెడ్డి, శరత్‌చంద్ర, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిని కలవకుండా చూడండి..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువును సోమవారం జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు చెరువులో మురుగునీరు కలుస్తుందని, దీంతో దోమలు, దుర్గంధంతో నానా అగచాట్లు పడుతున్నామని వివరించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో మురుగునీరు చెరువులో కలవకుండా డైవర్షన్ చేసిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. చెరువులో నీరు మట్టం ఎక్కువ అయినపుడు అలకాపూర్ టౌన్ షిప్ వరకు నిలిచి తీవ్ర ఇబ్బంది పెడుతుందన్నారు. దీంతో ఆయన డ్రైనేజీ డైవర్షన్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, కౌన్సిలర్‌లు శ్రీకాంత్‌స్వామి, నవీన్‌కుమార్, పద్మారావులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

కాముని చెరువు పరిశీలన..



శంషాబాద్: పట్టణంలోని కాముని చెరువును జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం పరిశీలించారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆయన తహసీల్దార్ రవీందర్ దత్తు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, ట్రాఫిక్, ఇరిగేషన్ పనులు సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకటరెడ్డి తదితరులున్నారు.

ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఈవీఎం మిషన్లను తనిఖీ చేశారు. ప్రతి మూడు నెలలకొక్కసారి రెగ్యూలర్‌గా పరిశీలించడం జరుగుతుందని.. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రారంభ సమయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులను పిలిపించారు. ఇందులో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కాంగ్రెస్ నుంచి దనుంజయ, బీఎస్పీ నుంచి ఆదర్ల శ్రీనివాస్, ఎంఐఎం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిద్దులగుట్ట ముఖద్వారం ప్రారంభం



శంషాబాద్: దాతల సహకారంతో సిద్దులగుట్ట ఆలయానికి ముందు ఏర్పాటు చేసిన ముఖద్వారాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ప్రారంభానికి ముందు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దులగుట్ట ఆలయాభివృద్ధిలో భాగంగా ముఖద్వారం పూర్తి చేయించడం జరిగిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శాంతరాజ్‌కు సిల్వర్ మెడల్

మైలార్‌దేవ్‌పల్లి: మంచేరియల్‌లో ఆదివారం జరిగిన సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వుషు చాంపియన్‌షిప్ 2024 పురుషుల విభాగం పోటీలలో మహావీర్ ఉషు మార్షల్ ఆర్ట్ అకాడమీ మైలార్‌దేవ్‌పల్లికి చెందిన శాంతరాజ్ సిల్వర్ మెడల్ సాధించాడు. అకాడమీ కోచ్ మామిళ్ల సంతోష్ యాదవ్ శాంతరాజ్‌ను అభినందించారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

రాజేంద్రనగర్: గణేష్ నిమజ్జనానికి పత్తికుంట చెరువుల వద్ద నిర్వహిస్తున్న పనులను సోమవారం ఉపకమిషనర్ రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు పక్కనే ఉన్న పలు కాలనీలు, బస్తీల నుంచి దాదాపు 9 వేల గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేశామన్నారు. ప్రస్తుతం గణేష్ నవరాత్రి నిమజ్జనం సందర్భంగా పత్తికుంట వద్ద వచ్చే గణనాథులను నిమజ్జనం చేసేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. చిన్న గణపతులను కొలనులో, పెద్ద గణనాథులను కుంటలో నిమజ్జనం చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. చెరువులో ఉన్న చెత్తను తొలగిస్తున్నామని, కొలనును శుభ్రపరిచి మంచినీటితో నింపనున్నట్లు తెలిపారు. క్రేన్లతో పాటు విద్యుత్


పత్తికుంట చెరువు, కొలను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

దీపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే గణేష్ నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి సదుపాయం తదితర వాటి ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. 3,5,7,9,11వ రోజుల్లో 24 గంటల పాటు సిబ్బందిని నిమజ్జనానికి ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు.

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి తగు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదులను అప్పగించినట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అం


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

దిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.



కత్వ.. కనువిందు

భారీ వర్షాలకు మండలంలోని ననాజీపూర్ కత్వ నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. ఎంటేరువాగుపై ఉన్న ఈ కత్వంపై నుంచి జాలువారే వరదనీరు చిన్నపాటి జతపాతాన్ని తలపిస్తుంది. ఇటు వైపు సందర్శకులు రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. -శంషాబాద్ రూరల్

విద్యార్థినుల ఆందోళనతో సర్కారు చర్యలు

కేజీబీవీలో 10 మంది ఉపాధ్యాయుల బదిలీ

శంషాబాద్ రూరల్: తమ సమస్యలపై గళం విప్పి జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన కేజీబీవీ విద్యార్థినులకు ఎట్టకేలకు కాస్త ఊరట దొరికింది. మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న 10 మందిని ఒకేసారి బదిలీ చేశారు. వీరిలో బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. పాఠశాల ఎస్ఓ (స్పెషల్ ఆఫీసర్)తో పాటు ఉపాధ్యాయులను వేరే చోట్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరి స్థానంలో కొత్తగా ఉపాధ్యాయులను నియమించారు. మిగతా చోట్ల ఉన్న కేజీబీవీల నుంచి ఒక్కక్కరు చొప్పున ఉపాధ్యాయులను ఇక్కడ నియమంచినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. వంట సిబ్బంది మినహా మిగతవారు బదిలీ కావడంతో ఇకనైనా తమకు ఇబ్బందులు ఉండవని విద్యార్థినులు భావిస్తున్నారు.

మిగతా సమస్యల పరిష్కారమెప్పుడో..

పాఠశాలలో భోజన, వసతి సౌకర్యాలతో పాటు బోధన సరిగా లేదంటూ గత నెల 30న విద్యార్థినులు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తైయింది. ఇక యూనీఫాం, కాస్మోటిక్ ఛార్జీలు బిల్లులు ఎప్పుడు మంజూరు అవుతాయో చూడాల్సి ఉంది. సురక్షిత తాగునీటి కోసం ఇక్కడ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. బయట నుంచి ఫిల్టర్ నీళ్ల కొనుగోలు చేస్తుండగా.. గత కొంత కాలం నుంచి విద్యార్థులు బోరు నీళ్ల తాగుతున్నారు. శాస్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు. ఇక కులం పేరుతో విద్యార్థినులను దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని పలువురు సూచించారు. అయితే ఈ విషయంపై ఎవరి నుంచి ఫిర్యాదు రాలేదని ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపారు.


పాల్మాకులలోని కేజీబీవీ ఆవరణలో ధర్నాకు కూర్చున్న విద్యార్థినులు (ఫైల్)